# మానవుడు చైతన్య స్వరూపుడు

గుండెలదరునట్టి గొప్ప సంపదలేల?
కొర్కెలదిమిపట్టు కూలి మేలు
పూర్ణ సుఖము లేదు, పూర్ణ దుఃఖము లేదు
ద్వంద్వబద్ధమైన ధరణియందు!

ప్రవహించు నేపురి పరిధిగా పాయలై
చిత్రావతీనది చిత్రగతుల
క్రాలు నేపట్టణ కల్యాణకరముగా
చుట్టును మేలైన చూతతరులు
కావుండు నేపురి కడల నాల్గిటియందు
పార్వతీశ్వరులెప్డు బాయకుండ
కొలువుండు నేపురి విలసితంబగు మధ్య
మహిమాన్వితుండైన మాధవుండు
మండలావని గణుతించు మెండు మహిమ
చిక్కవడియరు కట్టిన చెఱువుతోడ
బుక్కరాయల చిరకీర్తి భువనమెంచ
పొసగ చాటు నీపురము చైతన్యపురము!

ప్రేమస్వరూపులారా! చైతన్యజ్యోతి అనే పేరు నూతనమైనది కాదు. సర్వత్రా నిండియున్నది చైతన్యమే. త్రిలోకములందూ, త్రికాలములందూ, త్రిగుణములందూ సంచరించునది చైతన్యమే. ప్రపంచంలో జీవరాసులు పుట్టకపూర్వం, అసలు సృష్టియే జరుగక పూర్వం కూడా ఉన్నది చైతన్యమే. పంచభూతములయొక్క చైతన్యమే ఈ ప్రపంచం. పంచభూతములయొక్క స్వరూపమే చైతన్యం.

srisathyasaivachanamrutam

పంచభూతములలో మొట్టమొదటిది ఆకాశం. దీనినే శబ్దబ్రహ్మమని అన్నారు. శబ్దబ్రహ్మముయొక్క స్వరూపమే ప్రణవము. ఈ ప్రణవమునుండియే సర్వమూ ప్రారంభమైనవి. ఆదిశబ్దం ప్రణవము. మిగిలినవన్నీ ఈ శబ్దముయొక్క సృష్టియే. హార్మోనియం వాయించే పిల్లలకు తెలుసు – అందులో గాలిని నింపి ఒక్కొక్క రీడ్‌ను వత్తితే ఒక్కొక్క శబ్దం వస్తుంది. ఈ సర్వశబ్దములకూ వికారశబ్దములని పేరు పెట్టారు. ఈ వికార శబ్దములకు ఓంకారనాదమే ఆధారం. ఈ శబ్ద బ్రహ్మమునుండి గాలి ప్రారంభమయింది. గాలి కూడా దైవస్వరూపమే. గాలియే లేకుండిన జీవమే లేదు. మూడవది అగ్ని. అగ్ని లేకుండా ఏ జీవీ ఉండజాలదు. తరువాత జలము, పృథ్వి ప్రారంభమైనాయి. చిన్న చిన్న క్రిములు, పక్షులు, జంతువులు మున్నగు అనేక జీవరాసులు ఆవిర్భవించాయి. ఇది కేవలం దైవసంకల్పమే.

భగవంతుడు "ఏకోహం బహుశ్యాం" అని సంకల్పించుకొని, తానొక్కడే అనేక రూపాలను ధరించాడు. పంచభూతములు భగవంతుని స్వరూపములే. అడవులు, కొండలు, గుట్టలు, సముద్రాలు, పంటలు... వీటన్నింటికీ భూమియే ఆధారం. ఈ భూమిపైనున్న భారము ఇంక దేనిపైనా లేదు. పంచభూతముల వల్లనే ఈ జగత్తు పోషింపబడుతూ వచ్చింది. తరువాత మృగములు మనుష్యులుగా, మనుష్యులు మృగములుగా మార్పు చెందుతూవచ్చారు. అందువల్లనే, ఎవరైనా తప్పు చేస్తే పెద్దలు "ఏమిరా, నీవేమైనా మృగానివా?" అని ఖండిస్తుంటారు. మానవునియందు ఇంకా అనేక మృగలక్షణాలు ఇమిడియున్నాయి. ఎందుకంటే పాతవాసనలు ఇంకా కొన్ని పోలేదు.

**వచ్చుకప్రపు మడిలోన పాదు చేసి**
**కమ్మ కస్తూరి యెరువుగా కుమ్మరించి**
**మంచి పన్నీరు పోసియు పెంచిరేని**
**ఉజ్జగించునె తన కంపు ఉల్లిపాయ**

ఉల్లిపాయను వేయితూర్లు కడిగినా దాని వాసన పోదు. అదేరీతిగా ఈనాటి మానవుడు ఎన్ని సాధనలు చేసినప్పటికీ మృగత్వాన్ని త్యజించలేకపోతున్నాడు. చదువులచేత, సాధనలచేత, సత్య సంకల్పములచేత మానవుడు తనలోని మృగత్వాన్ని అణగద్రొక్కాలి. మనం చేసే సమస్త



sri sathyasai vacharamrutam

సాధనలూ మృగత్వాన్ని అణగద్రొక్కేందుకు ఉద్దేశించినవే. ఈనాటి మానవునికి కల్గుతున్న వాంఛలు కేవలం మృగవాంఛలే. నిజంగా మానవుడనగా ఎట్టి కోరికలూ లేనివాడని, పవిత్రమైనవాడని ఉపనిషత్తులు వర్ణిస్తున్నాయి. ఇలాంటి పవిత్రమైన మానవత్వంలో కోరికలు ప్రారంభం కావటానికి కారణమేమిటి? పాతవాసనలే. ఈ పాతవాసనలను క్రమక్రమేణ పోగొట్టుకోవటానికి ప్రయత్నించాలి.

### మూడు తరహాల వ్యక్తులు

ఈ జగత్తులో మానవులు మూడు రకాలుగా ఉన్నారు. మొదటి తరహా వ్యక్తి చక్కగా విడదీసిన ప్రత్తివంటివాడు. అగ్ని సోకిన తక్షణమే ప్రత్తి భస్మమైనట్లుగా, జ్ఞానాగ్ని సోకిన తక్షణమే అతని హృదయం పవిత్రమౌతుంది. రెండవ తరహా వ్యక్తి పచ్చికట్టెవంటివాడు; జ్ఞానాగ్నికి ఎంత సమీపంగా వెళ్ళినప్పటికీ అతని హృదయం పవిత్రం కాదు. ఇంక మూడవ తరహా వ్యక్తి ఎండుకట్టెవంటివాడు; జ్ఞానాగ్నికి సమీపంగా వెళ్ళినప్పుడు అతని హృదయం క్రమక్రమేణ పవిత్రమౌతుంది. అనేక జన్మల సాధనల ఫలితముచేత 'పచ్చికట్టె' 'ఎండుకట్టె'గా మారిపోతుంది. ఈనాటి మానవుడు ఇంకా పచ్చికట్టెగానే ఉన్నాడుగాని, ఎండుకట్టెగా లేదు; ప్రత్తిగా అసలే లేదు. ఎందుకనగా తాను చేసే సాధనలను పట్టుదలతోనూ, త్యాగభావంతోనూ చేయటంలేదు. త్యాగభావమే లేకుండిన మానవుని యందు ఆధ్యాత్మికభావము వెలుగొందదు.

### కోరికలే రాక్షసత్వాన్ని పెంచుతున్నాయి

ఈనాటి మానవుడు ఇతరులు తనకుచేసిన ఉపకారాన్ని విస్మరించటమే కాక, ఉపకారికే అపకారం తలపెడుతున్నాడు; మోహములో మునిగి అనేక జన్మలెత్తుతున్నాడు. జన్మలు పెరగటానికిగాని, పరిహారం కావటానికి గాని కర్మలే కారణం. జన్మరాహిత్యం కావాలంటే మొట్టమొదట కోరికలను అరికట్టుకోవాలి. దేహాభిమానంవలన మానవునిలో కోరికలు పెరిగిపోతున్నాయి. కనుక, రాక్షసులంటే ఏదో ప్రత్యేకమైన ఆకారం కల్గినవారు కాదు. తనలో ఉన్న మానవత్వాన్ని, దైవత్వాన్ని విస్మరించినప్పుడు మానవుడే రాక్షసుడుగా మారిపోతాడు. మీరు రామాయణంలో చదివే ఉండవచ్చు – శూర్పణఖ రాముణ్ణి వివాహమాడాలని ఆశించి చాలా అందమైన స్త్రీ రూపంలో వచ్చింది. కాని, రాముడు ఒప్పుకోకపోవటంచేత తక్షణమే

srisathyasaivachanamrutam

రాక్షసిగా మారిపోయింది. అదేరీతిగా, మానవుడు తన అభీష్టం నెరవేరనప్పుడు రాక్షసునిగా మారిపో తున్నాడు. కోరికలే మానవత్వాన్ని మరపించి పశుత్వాన్ని, రాక్షసత్వాన్ని అభివృద్ధి గావిస్తున్నవి.

ప్రేమస్వరూపులారా! మీరు చైతన్యజ్యోతిని చూసియుండవచ్చు, చాలా అందంగా నిర్మించారు. అందమే కాదు, అందులో ప్రవేశించినవారికి ఆనందము కూడా ప్రాప్తిస్తుంది. దీనిని ఇంత సుందరమైన మందిరంగా తీర్చిదిద్దటానికి కొందరు భక్తులు చాలా శ్రమపడ్డారు. చైనా మరియు కొన్ని ఇతర దేశాలనుండి దీనికి అవసరమైన వస్తువులను తెప్పించి, వివిధ దేశాలకు సంబంధించిన శిల్పకళారీతులను చేర్చి చైతన్యజ్యోతిని చాలా అందంగా రూపొందించారు. ఇలాంటి మందిరాన్ని మనం చైనాకి పోయినా చూడలేము. అందము, ఆనందము రెండింటితో కూడినది చైతన్యజ్యోతి. అయితే చైతన్యము ఒకరు తెచ్చేది కాదు, అది సహజంగా ఎప్పుడూ ఉంటూనే ఉన్నది. అసలు చైతన్యజ్యోతి నిర్మాణం ఎట్లా ప్రారంభమైంది? అది ఎవ్వరూ మీకు చెప్పలేదు. కొండ మీద ఉన్న హనుమంతుని వద్దకు పోవటానికి కొన్ని మెట్లమాదిరి కట్టాలని సంకల్పించుకున్నారు. వృద్ధులు అలసి పోయినప్పుడు విశ్రాంతి తీసుకోవటానికి మధ్యలో అక్కడక్కడ చిన్నచిన్న రూములు కట్టాలని అనుకున్నారు. ఈవిధమైన సంకల్పంతో ప్రారంభమై క్రమక్రమేణ అది చైతన్యజ్యోతిగా రూపుదిద్దుకుంది. ఆ కొండను పగలగొట్టి ఆ ప్రాంతాన్ని చదును చేయటానికి వాళ్లు పెద్ద తపస్సు చేశారు! కొండను పగల గొట్టటానికే చాలాకాలం పట్టింది. ఎంతో శ్రమపడి ఈ సుందరమైన మందిరాన్ని నిర్మించారు.

**కష్టం లేకుండా సుఖం లభించదు**

మీరు ఏదైనా మంచిపని చేయాలంటే ఎన్నో శ్రమలకు ఓర్చుకోవలసి వస్తుంది. ఒక బంగారు కడియాన్ని తయారుచేయాలంటే, బంగారాన్ని అగ్నిలో వేసి కరగబెట్టాలి, దానిని సుత్తితో కొట్టి సాగదీయాలి, తరువాత కటింగ్స్ చేయాలి, వెల్డింగ్ చేయాలి. ఈరీతిగా, ఎన్నో పనులు చేస్తేగాని బంగారు కడియం తయారుకాదు. అదేవిధంగా, మానవుడు దైవంగా మారాలంటే, తనలో దైవభావాలు ఆవిర్భవించాలంటే ఎన్నో కష్టములకు ఓర్చుకోవాలి. ఏది జరిగినా "ఇది నా మంచి కోసమే" అని భావించాలి. ఆవిధమైన దీక్షతో నిర్మించటంచేతనే ఈ

srisathyasaivachanamrutam

చైతన్యజ్యోతి మన కంటికి ఇంపు, హృదయానికి సొంపు కలిగించేరీతిగా రూపుదిద్దుకుంది. కష్టపడకుండా సుఖం పొందటానికి వీలుకాదు. "నసుఖాత్ లభ్యతే సుఖం" సుఖమునుండి సుఖము లభించదు, కష్టమునుండియే సుఖము లభిస్తుంది. కాని, ఈనాటి భక్తుడు కష్టపడటానికి సిద్ధంగా లేడు. "కాసు ఖర్చు కాకూడదు, కాలు గడప దాటకూడదు. కైవల్యం ఠక్కున ఒళ్ళో ఉట్టిపడాలి" అని ఆశిస్తున్నాడు. తనకు సకల సుఖాలూ సులభంగా లభించాలని కోరుతున్నాడు. సులభంగా లభించే సుఖము సులభంగానే వెళ్ళిపోతుంది. ప్రాచీన మహర్షులు అనేక సంవత్సరాలు నిద్రాహారాలను త్యజించి కఠోరమైన తపస్సు చేసిన తరువాతనే దైవత్వాన్ని దర్శించగల్గారు. అదేరీతిగా, మనం సుఖమును పొందవలెనంటే కష్టమునకు గురికాకతప్పదు.

**కష్టసుఖములు రెండును కలిసియుండు**
**వీని విడదీయు టెవ్వరి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు**

దివ్యత్వాన్ని అనుభవించాలంటే మానవునికి ఓపిక అత్యవసరం. ఎన్నో చదువులు చదివి, గొప్ప విద్యావంతుడని పేరొందినప్పటికీ ఈనాటి మానవునికి చిన్నచిన్న విషయాల్లో కూడా ఓపిక లేకుండాపోతున్నది. ఓపిక ఉన్నప్పుడే దేనినైనా మనం సాధించగలం. కష్టాలకు క్రుంగిపోకూడదు. క్రోధానికి తావీయకూడదు. క్రోధం మానవత్వాన్ని మంటగలుపుతుంది. "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష, తన సంతోషమె స్వర్గము, తన దుఃఖమె నరకము" ఎవరి సుఖదుఃఖాలకు వారే కారకులు. ఎవరిపైనో నెపం వేసి బాధపడటం చాలా పొరపాటు.

**"దైవం మానుష రూపేణ"**

మానవుడు తనయందే ఉన్న చైతన్యమనే నిధిని విస్మరించి, బాహ్యమైన నిధులకోసం ప్రాకులాడుతూ కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు. ఇదే పెద్ద అజ్ఞానం. చదువుకున్నవారు కూడా అజ్ఞానంలో మునిగి విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. తెలియకపోతే తెలియనట్లు ఉండటం మంచిది. కాని, తెలియని దానిని తెలిసినట్లుగా ఊహిస్తున్నారు, ఏమీ తెలియనప్పటికీ అన్నీ

sri sathyasai vachanamrutam

తెలిసినట్లు అహంకారంతో విఱ్ఱవీగుతున్నారు. మొట్టమొదట అహంకారాన్ని నిర్మూలించుకోవాలి, వినయవిధేయతలను అభివృద్ధి గావించుకోవాలి. ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా ఈనాడు మీరు చైతన్యజ్యోతియొక్క తత్త్వాన్ని గుర్తించుకోవాలి. చైతన్యము సర్వులయందున్నది. అక్కడ, ఇక్కడ, ఎక్కడ చూసినా ఉన్నది ఒకే చైతన్యము. ఇట్టి సర్వవ్యాపకమైన చైతన్యమునే 'కాన్షియస్‌నెస్' అన్నారు. మన దేహంలో ఉన్న చైతన్యమును 'కాన్షియన్స్' అన్నారు. సర్వత్రా ఉన్న చైతన్యము మానవుని దేహంలో ఆత్మగా సంచరించటం ఎంత అద్భుతం! అన్నీ మానవునియందే ఉన్నాయి. మానవుణ్ణి మించినది మరొకటి లేదు. కనుకనే "దైవం మానుష రూపేణ" అన్నారు. దైవం ఎలా ఉన్నాడంటే, మనుష్యాకారంలో ఉన్నాడు. ఎక్కడ? ఇక్కడే! ఎక్కడ చూసినా ఉన్నది ఒక్కడే. కాని, ఆకారమును చూసి మీరు అపోహలకు చోటిస్తున్నారు. కారణం ఏమిటి? మీదీ ఆకారమే. కాని, మీ ఆకారమును మీరు నమ్మటం లేదు. అన్ని ఆకారములూ దైవస్వరూపములే. ఈ దేహంలోని పంచభూతములే మీ దేహంలోను ఉన్నాయి. ఆరవభూతము లేనే లేదు. పంచభూతములు,పంచ ప్రాణములు, పంచకోశములు ఇవన్నీ ఒకే రూపములో ఇమిడియున్నాయి.

**పంచకోశములు**

మానవుడు ఆహారాన్ని భుజించి తన దేహాన్ని నిలుపుకుంటున్నాడు. కాబట్టి దేహాన్ని అన్నమయకోశమన్నారు. రెండవది ప్రాణమయకోశము, తరువాతది మనోమయకోశము. "మనో మూల మిదం జగత్" మనస్సే జగత్స్వరూపంగా మారిపోతున్నది. కనుక మనోమయకోశము చాలా ప్రధానమైనది. అయితే ఈనాటి సాధకులు, యోగులు కేవలం మనోమయము వరకు మాత్రమే ప్రయాణం చేస్తున్నారు. అక్కడితో వారి ప్రయాణం నిలిచిపోతున్నది. అట్లా ఉండకూడదు. మనస్సుకు ఎన్ని బాధలు కల్గినా లెక్కచేయకుండా ముందుకు సాగాలి. మనోమయకోశము దాటితే విజ్ఞానమయ కోశములో ప్రవేశిస్తాము. దానిని దాటటం లేదు కనుకనే మానవుడు అన్నమయంలో, అజ్ఞానంలో ఉంటున్నాడు. మనోమయకోశం దాటటమే కష్టం. దానిని దాటితే విజ్ఞానం చాలా సులభంగా వస్తుంది. ఈ విజ్ఞానం మనకు లభించెనా, ఇంక అంతా ఆనందమయమే! అదియే నిత్యానందం, అదియే పరమానందం, అదియే యోగానందం, అదియే అద్వైతానందం. అయితే, దేహాన్ని అలక్ష్యం

sri sathyasai vachanamrutam

చేయకూడదు. దేహం చాలా పవిత్రమైనది. సకల దైవస్వరూపాలూ మానవాకారంలోనే గోచరిస్తాయి. కాని "నేను బలహీనుడను" అనే భావంచేత మానవుడు గొఱ్ఱెగా మారిపోతున్నాడు. మొట్టమొదట మానవత్వంయొక్క విలువను గుర్తించాలి. మానవుడనగా అజ్ఞానం లేకుండా వర్తించువాడని అర్థం.

## లోపలా, వెలుపలా ఉన్నది చైతన్యమే

ఈ చైతన్యజ్యోతి ప్రదర్శనాలయం మానవుడు తనలో ఉన్న చైతన్యముయొక్క విలువను, విచిత్రమును గుర్తించటానికి ఉద్దేశించిందేగాని, వినోదంకోసం ఏర్పాటు చేయబడింది కాదు. మానవునియందు కాళ్ళనుండి తలవరకు చైతన్యం సంచరిస్తున్నది; లోపలా, వెలుపలా ఉన్నది చైతన్యమే. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః" అదియే చైతన్యజ్యోతి, ప్రజ్ఞాన జ్యోతి, అనంతజ్యోతి, అఖండజ్యోతి, అద్వైతజ్యోతి. అది ప్రతి మానవుని హృదయభూమియందు వెలుగుతూనే ఉన్నది. దయతోకూడినదే హృదయం, కాని మానవుడు నిర్దయుడై, రాక్షసత్వంతో జీవిస్తున్నాడు. "నా హృదయంలో ఎలాంటి భావాలున్నాయి?" అని తాను విచారణ చేసుకోవాలి; ఆత్మతృప్తికోసం పాటుపడాలి. ఆత్మతృప్తిని పొందినప్పుడే మానవుడు స్వార్థత్యాగం చేస్తాడు. స్వార్థత్యాగం చేసినప్పుడే ఆత్మసాక్షాత్కారం పొందగలడు.

## భక్తుల తృప్తికోసం నేనేమైనా చేస్తాను

ప్రేమస్వరూపులారా! నేను ఈరోజు అసలు మాట్లాడాలని అనుకోలేదు. కాని చైతన్యజ్యోతి వార్షికోత్సవం జరపాలని చైనా నుండి ఈ ఆర్కిటెక్టు వచ్చాడు, ఇంకా అనేకమంది వచ్చారు. వారి నందరినీ తృప్తిపరచే నిమిత్తం నేను దీనికి అంగీకరించాను. భక్తుల తృప్తికోసం నేనేమైనా చేస్తాను. నేను చేసే పనులన్నీ భక్తులను తృప్తిపరచే నిమిత్తమే. నాకు ఎట్టి కోరికలూ లేవు, ఎట్టి సంకల్పాలూ లేవు. భక్తుల సంకల్పాలను బట్టే నా సత్యసంకల్పము అభివృద్ధి అవుతుంది. మీవి కేవలం సంకల్పాలు మాత్రమే. కాని, నాది సత్యసంకల్పం. అది మారేది కాదు. మీ ఆనందంకోసం నేనేమైనా చేస్తాను. ఈ చైతన్యజ్యోతికోసం ఇందులాల్ షా చాలా శ్రమపడ్డాడు. అసలు దీనికి మూలకారకుడు అతనే. నేనిక్కడ లేకపోయినా తాను ప్రతి నెల వచ్చి, దీనికి సంబంధించిన పనులను చూసుకొని వెళ్ళేవాడు. అంతటి శ్రద్ధ ఉంటే ఎంతటి ఘనకార్యమైనా సాధించవచ్చు. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అతనియొక్క శ్రద్ధ, ఈ ఆర్కిటెక్టు యొక్క శ్రమ – ఈ

sri sathyasai vahini amrutam

రెండింటి చేతనే చైతన్యజ్యోతి ఇంత అందంగా రూపుదిద్దుకొని, అందరికీ ఆనందాన్ని అందిస్తోంది. మనం ఏదైనా మంచి పని చేయాలనుకుంటే గట్టి పట్టుదల ఉండాలి. బలహీనతకు చోటివ్వకూడదు. ఒకనాటి కుగ్రామమైన పుట్టపర్తి ఈనాడు పెద్ద టౌన్‌గా మారిపోయింది. సిటీల్లో దినానికి నూరు రూపాయలిస్తే ఒక రూమ్ దొరుకుతుంది. కాని, పుట్టపర్తిలో బయట ఒక్కొక్కసారి దినానికి వేయి రూపాయలిచ్చినా రూమ్ చిక్కటం కష్టం. ఒక చిన్న పల్లె ఎలా మారిపోయిందో చూడండి. పెద్ద పెద్ద పట్టణాల్లో కూడా లేని ఎయిర్‌పోర్టు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇక్కడ నెలకొన్నాయి. యావత్ప్రపంచానికి ఆదర్శాన్ని అందించే కార్యక్రమాలు ఇంకా ఎన్నో జరగబోతున్నాయి. ఎందరో ప్రముఖులు ఇక్కడికి వస్తున్నారు. ఎవ్వరినీ మేము ఆహ్వానించటం లేదు. వారే వస్తున్నారు. కారణమేమిటి? ఇక్కడ చైతన్య జ్యోతి ఉన్నది. ఆ దివ్యజ్యోతియే అందరినీ ఆకర్షిస్తున్నది.

నేను పుట్టిన పండుగ జరుపుకోకూడదని అనుకున్నాను. “ఈ బర్త్‌డేకి ఏమీ ఏర్పాట్లు చేయకండి” అని చిరంజీవిరావుతో కూడా చెప్పాను. మీ అందరిలో ఆనందము ఏనాడు అభివృద్ధి అవుతుందో అదే నా బర్త్‌డే. లోకమంతా క్షేమంగా ఉండాలి. అందరికీ ఆనందము నివ్వటమే నాకు ఆనందము. మీరందరూ ఆనందాన్ని అనుభవించండి. సత్యమార్గాన్ని అనుసరిస్తూ దేశాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దండి. దేశాన్ని మార్చలేకపోయినా కనీసం మీకు సమీపంగా ఉన్నవారినైనా సత్యసంకల్పులుగా తీర్చిదిద్దండి. ఒక్కొక్క దినమునకు కనీసం ఐదుమందినైనా ఆధ్యాత్మికమార్గంలో ప్రవేశపెట్టండి. అప్పుడు దేశమంతా ఆదర్శవంతంగా రూపొందుతుంది. ఒక చిన్న ఆదర్శాన్ని మీకు చెబుతున్నాను. నేనిక్కడికి బయల్దేరే సమయంలో నా గొంతు ఏమాత్రం సరిలేదు. కాని ఇక్కడికి వచ్చి మిమ్మల్ని చూసిన తరువాత నా గొంతును నేను మరచిపోయాను. మీ రూపాలను నా హృదయంలో పెట్టుకొన్నాను. అప్పుడే గొంతు బాగుపడింది. మనం దేహాభిమానమును వీడినప్పుడే మనలో దేశాభిమానం అభివృద్ధి అవుతుంది. ఇది ప్రత్యక్ష నిదర్శనం.

**(18-11-2001 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vahini... (watermark)